

ఊరు వెళ్తున్నారా..

దసరా సెలవుల నేపథ్యంలో ఊరికి వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. 10లో▸



షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఇంట్లోని వస్తులతో పాటుగా బంగారం, నగదు, విలువైన పత్రాలు కాలిపోయాయి. 10లో▸



ఆ భూములను రక్షించండి

ప్రభుత్వ భూములను రక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



రాచులూరులో పార్టీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న బొక్క నర్సింహారెడ్డి

కందుకూరు: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రాచులూరులో శనివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ సభ్యత్వాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనేగొని అశోక్‌గౌడ్, స్థానిక నాయకులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఐడియాథాన్‌లో మెరిసిన దంపతులు



ప్రశంసాపత్రం అందుకుంటున్న కృష్ణ, ధనరేఖ దంపతులు

కేశంపేట: రాష్ట్ర ఆర్థిక సంఘం నిర్వహించిన ఐడియాథాన్‌లో మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామానికి చెందిన అనమోని కృష్ణ, ధనరేఖ దంపతులు మెరిసారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు ప్రపంచవ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానించగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, న్యూఢిల్లీ, లక్నోతో పాటు విదేశాల నుంచి సుమారు 1,200 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కార్యదర్శి స్మితా సబర్వాల్ అక్టోబర్ 1న దరఖాస్తుదారుల ఐడియాలు విన్నారు. ఇందులో భాగంగా అనమోని కృష్ణ, ధనరేఖ నగరపాలక సంస్థల ఆర్థికాభివృద్ధి కోసం డిజిటల్ ప్రచారం అనే అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. వీరి ప్రజెంటేషన్ నచ్చడంతో గ్రాండ్ ఫినాలేకు ఎంపిక చేసి శనివారం హైదరాబాద్‌లోని హరితప్లాజాలో ప్రశంసాపత్రం అందించారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

కడ్తాల్: రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు అన్నారు. మండల పరిధిలోని కర్కల్ పహాడ్ గ్రామంలో శనివారం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. వర్షకాలం 2024 సీజన్‌కు సంబంధించి వ్యవసాయ విస్తరణ అధికారులు చేపట్టిన పంటల నమోదు కార్యక్రమంలో భాగంగా, నమోదు చేసిన పంటలను పరిశీలించారు. అధిక వర్షాలకు పంటల్లో వచ్చే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 1,28,870 ఎకరాల్లో వరిపంట సాగు చేయడం జరిగిందని, అందులో 2,96,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. సన్న రకాలు 78శాతం, దొడ్డు రకాలు 22 శాతం దిగుబడి రావొచ్చని పేర్కొన్నారు. ధాన్యాన్ని వరి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, క్వింటాలు గ్రేడ్ -ఏ ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 ధర నిర్ణయించినట్లు చెప్పారు. ప్రభుత్వం సన్న చిన్న కారు రైతులకు అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి తేమ 17 శాతం ఉండేట్లు చూసుకోవాలని, నాణ్యతా ప్రామాణాలు పాటిస్తూ, ధాన్యంలో రాళ్లు, తాలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారులు రమేశ్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

అడిగేవారేరి!

పార్కులు, శ్మశానవాటికలు కావేవీ కబ్జాలకనర్హం



- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- ఎక్కడికక్కడ అన్యాక్రాంతం
- ఫిర్యాదు చేసినా పట్టని అధికారగణం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భవిష్యత్తు తరాలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు అన్యాక్రాంతం అవుతున్నాయి. కళ్ల ముందే విలువైన స్థలాలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకున్న నాథుడే లేడు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 5,100 గజాల పార్కు స్థలం కనుమరుగవగా, ఆదిబట్ల మున్సిపాలిటీలో మున్సిపాలిటీ పేరున గిఫ్ట్ డీడ్ చేసిన 668 గజాలు మాయమైంది. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో తిలా పాపం తలా పిడికెడు అన్నట్లు ఏకంగా శ్మశానవాటిక స్థలం కబ్జాకు గురైంది. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది.

అప్పనంగా కాజేసి.. గుట్టుగా విక్రయించి..

మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 743,746,747,748,749,750లో సుమారు యాభై ఎకరాల్లో ఏళ్ల క్రితమే పంచాయతీ లే అవుట్ వేశారు. దీనిలో 5,100 గజాలు పార్కులు, ఇతర ప్రజావసరాలకు వదిలారు. పార్కుస్థలాలను నాటి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల పేరున నమోదు చేయలేదు. సదరు భూమి నాలా కన్వర్షన్ కూడా కాలేదు. దీంతో ఇప్పటికీ పాత యజమానుల పేర్లే కన్పిస్తుండటం.. పాత లే అవుట్‌లో ప్లాట్ల సంఖ్య క్రమపద్ధతిలో లేకపోవడం అక్రమార్కులకు కలిసి వచ్చింది. పక్కనే ఉన్న పట్టా భూముల సర్వే నంబర్, పాసు బుక్ నంబర్లు వేసి 5,100 గజాల ఖాళీ స్థలంలో 23 ప్లాట్లు చేసి గుట్టుగా విక్రయించారు. నాలా కన్వర్షన్ చేయకుండా, కొత్తగా వెంచర్ ఏర్పాటు చేయకుండా పాత వెంచర్‌లోని ఖాళీ స్థలాలకు 2023 ఆగస్టు 11న చంపాపేట ఎస్‌ఆర్‌ఓ రిజిస్ట్రేషన్లు చేశారు. రిజిస్ట్రేషన్‌కు ముందే టీఎస్ బీపాస్ ద్వారా ఒకే రోజులో నిర్మాణాలకు అనుమతులు జారీ చేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సాక్షాత్తు మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌లోని పార్కు స్థలాలకే రక్షణ లేకుండా పోయిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. నిజానికి వారసత్వంగా వచ్చిన భూములు.. ముందు కొడుకు/మనమడు పేరున రిజిస్ట్రేషన్ కావాలి. కానీ ఇందుకు విరుద్ధంగా ఇతరుల పేరున రిజిస్ట్రేషన్ చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కబ్జాచేసి.. కనిపించకుండా మొక్కలు నాటి

ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ రెవెన్యూలో నిర్మించి ఓ కన్వెన్షన్ హాల్ హెచ్‌ఎండీఏ ప్లాన్‌లో రోడ్లు, పార్కింగ్ ఏరియాలను స్థానిక ఆదిబట్ల మున్సిపాలిటీకి గిఫ్టుడీడ్ చేసింది. 24 డిసెంబర్ 2021లో 668.31 గజాల రోడ్డును కూడా మున్సిపాలిటీకి గిఫ్టుడీడ్ చేసింది. అధికారికంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధికారుల చేత ధ్రువీకరించి 20644/2021 డాక్యుమెంట్ నంబర్‌ను కూడా మున్సిపాలిటీలో ముట్టజెప్పారు. కన్వెన్షన్ హాల్ నిర్మాణం పూర్తయ్యే వరకు ఎలాంటి ఆక్రమణలు చేయలేదు. ఆ తర్వాతి సంవత్సరానికే సర్వే నంబర్ 388,389,390లలోని 668.31 గజాల భూమిని యాజమాన్యం కబ్జా చేసింది. ఏకంగా 500 మీటర్ల పొడవు, ఆరు ఫీట్ల ఎత్తు రోడ్డును నిర్మించారు. కట్టిన గోడ బయటికి కనిపించకుండా దారి పొడవునా పొడవాటి మొక్కలు నాటారు. ప్రస్తుతం ఇక్కడ గజం రూ.50 వేలకు పైమాటే.

శ్మశానవాటికనూ వదల్లేదు

తుర్కయంజాల్ మున్సిపాలిటీ వార్డు నంబర్ 22, సర్వే నంబర్ 212/1(కమ్మగూడ)లో రెండు ఎకరాల శ్మశానవాటిక ఉంది. దీనిలో ఇప్పటికే ఎకరానికిపైగా అన్యాక్రాంతం అయింది. పక్కనే ఉన్న మరో మూడు ఎకరాల్లో ప్రైవేటు వ్యక్తులు హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే వెంచర్ వేశారు. ఈ వెంచర్‌కు రాకపోకల కోసం శ్మశానవాటికకు వదిలిన స్థలం నుంచి రహదారి ఏర్పాటు చేశారు. ఈ అంశంపై స్థానికులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా.. చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సరికదా ఆక్రమణదారులకు మున్సిపల్ అధికారులు వత్తాసు పలుకుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పల్లెప్రకృతి వనం ఆక్రమణ

ఫరూఖ్‌నగర్ మండలం కాసిరెడ్డిగూడలోని సర్వే నంబర్ 804లో 8.6 ఎకరాల గోపాజీకుంట శిఖం భూములున్నాయి. చెరువు శిఖానికి ఆనుకుని ఓ బ్యాటరీ కంపెనీ, శిఖం భూమిలో భారీ కాంప్లెక్స్ వెలిసాయి. పల్లె ప్రకృతి వనానికి ఆనుకుని ఉన్న స్థలంలోనూ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇరిగేషన్, పంచాయతీ కార్యదర్శి వీటికి ఏవిధంగా అనుమతులు ఇచ్చారనేది అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది. కళ్లముందే ఖరీదైన భూములు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వదిలిపెట్టే ప్రసక్తే లేదు



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

- కాంగ్రెస్ హామీలు అమలు చేసే దాకా వెంటపడుతూనే ఉంటాం
- రైతుధర్నాలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

కందుకూరు: ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు కాంగ్రెస్ పార్టీని వదిలేది లేదని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా తదితర సమస్యలపై బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో రైతు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సురభివాణీదేవి, శంభీపూర్‌రాజు, నరేందర్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, ఆనంద్, మహేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, పార్టీ రాష్ట్ర నాయకులు కార్తీక్‌రెడ్డి, క్యామ మల్లేష్, రైతుబంధు జిల్లా మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. రైతులకు కేసీఆర్ హయాంలో అమలు చేసిన పథకాలతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూసిందన్నారు. కాంగ్రెస్ పాలనలో రుణమాఫీ పూర్తి చేయడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నాడని ఎద్దేవా చేశారు. మరోవైపు మైక్ తీసుకుంటే చాలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో కంపెనీలు తెచ్చి లక్ష మందికి ఉపాధి లభించేలా చేశామని.. తొమ్మిది నెలల పాలనలో కాంగ్రెస్ ఏ ఒక్క కంపెనీ తేలేకపోయిందన్నారు. ఈ ప్రాంత రూపురేఖలు కేసీఆర్, కేటీఆర్ మార్చారని కొనియాడారు. తనకు మూడు ఫాంహౌస్‌లు ఉన్నాయని, వాటిని కూల్చుతామని రేవంత్‌రెడ్డి అంటున్నాడని, అవి ఎక్కడున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ హయాంలో రైతుకు భరోసా

ఎమ్మెల్సీ సురభివాణీదేవి మాట్లాడుతూ.. రైతు కూలీని రైతును చేసింది మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అయితే రైతుకు భరోసా కల్పించి వ్యవసాయం అంటే పండుగలా చేసింది కేసీఆర్ అన్నారు. ఫోర్త్‌సిటీలోకి గ్రీన్‌ఫీల్డ్ రహదారిని 300 అడుగుల మేర నిర్మించడం బదులు ప్రస్తుతం ఉన్న శ్రీశైలం రహదారిని విస్తరించాలన్నారు.

ఇలాంటి సీఎంను చూడలేదు

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన మాట మేర రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఇలాంటి సీఎంను ఎక్కడా చూడలేదన్నారు. రియల్ ఎస్టేట్ కోసం, అత్తగారింటి కోసం రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు.

బీఆర్‌ఎస్ అంటే భారతీయ రైతు సమితి

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అంటేనే భారతీయ రైతు సమితి అన్నారు. రైతులను రాజు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి కూల్చుడే కానీ కట్టడం తెలియదన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు రజనీసాయిచంద్, చిలకమర్రి నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, కాకి దశరథ, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు టి.ఇందిర, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

నూతన విద్యా విధానం తెస్తాం

- ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు
- రాష్ట్ర ఐటీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు

చేవెళ్ల: రాష్ట్రంలో నూతన విద్యా విధానం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని, దీనిపై సబ్ కమిటీ వేసి అధ్యయనం చేస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని పద్మావతి కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని అన్నారు. ఉపాధ్యాయులను గౌరవించడం అంటే సమాజాన్ని గౌరవించినట్లే అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పటిష్టత కోసం ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని అయినా ఎందుకు ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి అనే అంశంపై ఉపాధ్యాయులు ఆలోచన చేయాలన్నారు. 317 జీఓతో ఇబ్బంది పడిన ఉపాధ్యాయులకు పండుగలోపే ఓ మంచి నిర్ణయం రాబోతోందన్నారు. శాసనమండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు భావితరాలకు బాటలు వేస్తారన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులు రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. ఎస్టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యు.పోచయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు బదిలీ నెల (జూలై) వేతనం ఇప్పించాలని కోరారు. హెచ్‌ఆర్‌ఏ స్థాయిని చేవెళ్ల నియోజకవర్గం వరకు పెంచే విధంగా చూడాలని మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే కాలె యాదయ్య విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మాలతి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శైలజ, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గం నాయకులు పామెన భీంభరత్, వసంతం, దర్శన్, మధుసూదన్‌రెడ్డి, గౌరీ సతీష్, వీరేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ వ్యాపారిపై దాడి

- కారు అద్దాలు ధ్వంసం చేసిన దుండగులు
- కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు

కడ్తాల్: ఓ మైనింగ్ వ్యాపారిపై దాడి చేసి, కిడ్నాప్‌నకు యత్నించిన ఘటన శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద చోటు చేసుకుంది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు.. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం రేమద్దుల గ్రామానికి చెందిన మైనింగ్ వ్యాపారి పిట్ల కతల్.. నగరంలోని కొండాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఓ కేసు నిమిత్తం అతని కుమారుడు శ్యామ్‌కుమార్, డ్రైవర్ విజయ్, మరోవ్యక్తి ఒంటి పులిబాబుతో కలిసి ఉదయం వెల్దండ పీఎస్‌కు వెళ్లారు. స్టేషన్‌లో పని ముగించుకుని హైదరాబాద్ వెళ్తుండగా కడ్తాల్ టోల్‌ప్లాజా వద్ద నలుగురు వ్యక్తులు వీరి వాహనాన్ని ఆపి రాళ్లతో దాడి చేశారు. ముందు సీట్లో కూర్చుని ఉన్న కతల్‌ను బయటకు లాగి కర్రలతో దాడి చేశారు. అనంతరం బలవంతంగా అతన్ని కారులో ఎక్కించుకుని ఆమనగల్లు వైపు తీసుకెళ్లారు. ఆతర్వాత వెల్దండ సమీపంలోని ఎన్నం హాస్పిటల్ వద్ద వదిలేసి పరారయ్యారు. బద్రియాదవ్, నిజాంతో పాటు మరో ఇద్దరు ఈ దాడికి పాల్పడినట్లు తెలిసింది. కతల్ కుమారుడు శ్యామ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యాపారి

రైతులకు మేలు చేకూరాలి

- గడ్డిఅన్నారం మార్కెట్ గొప్పతనాన్ని కాపాడుకోవాలి
- పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి సీతక్క



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

అబ్దుల్లాపూర్‌మెట్: గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ గొప్పతనాన్ని కాపాడుతూనే రైతులకు మేలు చేసే దిశగా నూతన పాలకవర్గం పనిచేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖమంత్రి సీతక్క ఆకాంక్షించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏనాడూ ప్రజాసమస్యలు పట్టించుకోని కేసీఆర్, ఏడాది కాలంగా నిరంతరం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న రేవంత్ సర్కారుపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజాపాలనే ధ్యేయంగా పనిచేస్తున్న రేవంత్‌రెడ్డికి ప్రజల పూర్తి మద్దతు ఉందన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌ను కేసీఆర్ ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిందని అన్నారు. చిలుక మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం సమష్టి కృషితో మార్కెట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసి రైతులు, వ్యాపారుల మన్ననలు పొందాలన్నారు.

అన్నివిధాలా సహకరిస్తాం..

కోహెడాలో నిర్మించనున్న నూతన పండ్లమార్కెట్ నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇప్పటికే రూ.350 కోట్ల నిధులున్నాయని, అత్యాధునిక మార్కెట్ నిర్మాణానికి కావాల్సిన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరయ్యేలా చూస్తామన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి

తనపై విశ్వాసంతో సీఎం రేవంత్‌రెడ్డి అతి పెద్ద మార్కెట్‌కు చైర్మన్ బాధ్యతలు అప్పగించారని, సీఎం పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయనని నూతన చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. అవినీతి రహిత మార్కెట్‌గా గడ్డిఅన్నారంను తీర్చిదిద్దేందుకు పనిచేస్తానన్నారు. సీఎం కాళ్లు మొక్కి అయినా గడ్డిఅన్నారం మార్కెట్‌ను అత్యాధునిక హంగులు, సదుపాయాలతో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, మల్లేశం కురుమ, ఎమ్మెల్యే సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ భాస్కరాచారి, డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సీఐ, ఏసీపీని బదిలీ చేయాలి

రిటైర్డ్ అదనపు డీజీపీ డాక్టర్ బాబురావు

కాచిగూడ: ఇబ్రహీంపట్నంలోని ఎడ్యుకేషన్ చారిటబుల్ క్రిస్టియన్ ఫెలోషిఫ్ సెంటర్‌పై దాడిని ఖండిస్తున్నామని రిటైర్డ్ అదనపు డీజీపీ డాక్టర్ బాబురావు అన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత నెల 28న ఎడ్యుకేషన్ కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తుండగా.. కొంతమంది హిందూ వాహిని సభ్యులు వచ్చి ఆకస్మికంగా దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో ఓ ప్రొఫెసర్, టీచర్‌తో పాటు పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేసి వారం గడుస్తున్నా.. కేసు నమోదు చేయలేదన్నారు. బాధితులకు న్యాయం చేయని ఇబ్రహీంపట్నం సీఐ, ఏసీపీలను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బిషప్ విరాజ్, ప్రభాకర్‌రావు, రవికుమార్, సుధీర్‌కుమార్, అరుణ్, జ్యోతి తదితరులు ఉన్నారు.

సాయన్న పోరాటం స్ఫూర్తిదాయకం



నివాళి అర్పిస్తున్న నాయకులు

- ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్

చేవెళ్ల: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దొరలను, భూస్వాములను ఎదిరించి పేద ప్రజల కోసం పోరాడిన వ్యక్తి పండుగ సాయన్న అని తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహావిష్కరణ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, నియోజకవర్గం నాయకుడు పామెన భీంభరత్, పటన్‌చెరు నాయకుడు నీలం మధు, సినీ నటుడు యాంకర్ బిత్తిరి సత్తి తదితరులతో కలిసి పండుగ సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దొరలు, భూస్వాములు, పెత్తందారులకు ఎదురుతిరిగిన వీరుడు సాయన్న అని కొనియాడారు. ఒకవైపు పోరాటం చేస్తునే ప్రజలను చైతన్యం చేశాడన్నారు. బహుజన వర్గాలు చదువుకోవాలనే సందేశాన్ని ఆనాడే ఇచ్చాడన్నారు. అందుకే ఆయన ప్రజల్లో దేవుడిగా, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా మిగిలిపోయారన్నారు. అలాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు తలారి మల్లేశ్, బైరిమోని మల్లేశ్, చేవెళ్ల నియోజకవర్గంలోని ఐదు మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The General Public is hereby informed that my client **SANDEEP PARUCHURI, S/o. Venkateswara Rao,** R/o. Film Nagar, Road No.82, Hyderabad, has entered into an agreement of sale to purchase the below mentioned schedule property from **1. CHENCHU MANJULA, W/o. Ganesh,** R/o. Mohammed Nagar Village, Kandukur Mandal, Ranga Reddy District, and **2. VISLAVATH SRINU, S/o.Vislavath Mohan** R/o. Pothubanda Thanda, Kandukur Mandal, Ranga Reddy District. That my client also paid substantial amount towards advance sale consideration and intend to go for regular Registered Sale Deed in respect of the schedule property.

Therefore I hereby call upon the General Public that, if any, person(s) have got any title, claim or objections in respect of the above transaction for the sale of schedule property, then they may approach the under signed within (3) Three days from the date of this publication along with relevant documents. If no claims or objections received within the stipulated time, then my client shall proceed to get the Registered Sale Deed, and there after no claims will be entertained.

SCHEDULE OF PROPERTY

All that the agricultural land in Sy.No.141/e/1/1/1, admeasuring Ac.2-19 Gts and in Sy.No.140/e/1/1/2, admeasuring Ac.0-10 Gts and in Sy.No.140/e/1/2, admeasuring Ac.0-10 Gts, total admeasuring Ac.2-39 Gts, situated at Mohammed Nagar Revenue Village, kandukur Mandal, Ranga Reddy District, and bounded by: **NORTH:** R.K.S.Nandana Vana Lay Out and 40 -0 Feet Road for entry in to schedule property. **SOUTH:** Land of Gandla Shivakumar, Basappa, **EAST:** Land of Soni Ketan and Durgesh Choudary, **WEST:** Land of Nathu Sharma.

Sd/- **S.MURALI GOUD**
Advocate
H.No. 6-54, Kandukur X Road Village,
Kandukur Mandal, Ranga Reddy Dist.
Cell No. 9948872977
muralisoudapu@gmail.com
Date: 05-10-2024

ఊరు వెళ్తున్నారా.. ఇల్లు జాగ్రత్త!

- తాళం వేసి వెళ్లేవారు ఠాణాలో సమాచారం ఇవ్వండి
- దొంగతనాల నివారణకు పోలీసుల సూచనలు



షాద్‌నగర్: దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ఎక్కువగా బంధువుల ఇళ్లు, స్వగ్రామాలకు, విహారయాత్రలకు వెళ్తుంటారు. వీళ్ల ఇళ్లనే టార్గెట్ చేసుకుని అక్రమార్కులు రెచ్చిపోతుంటారు. అందనికాడికి దండుకుని పరారవుతుంటారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

అంతర్రాష్ట్ర దొంగలు, ఇతర జిల్లాలకు చెందిన వారు అనువైన ప్రాంతాన్ని ఎంచుకుంటున్నారు. ఎక్కువగా శివారు కాలనీలు, తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రెక్కీ నిర్వహించి రాత్రి వేళ దోపిడీలకు పాల్పడుతుంటారు.

పోలీసుల సూచనలు

- సెలవులకు ఊరు వెళ్లేవారు కుటుంబ సభ్యుల్లో ఒకరు ఇంట్లో ఉండేలా చూసుకోవాలి.
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలి.
- ఊర్లో ముందు ఇంటి ఆవరణలో లైట్లు వేసి ఉంచాలి. డోర్‌కు తాళం వేసి కర్టెన్ వేయాలి.
- సోషల్ మీడియాలో మీరు ఊర్లో విషయం పోస్టు చేయడం మంచిది కాదు.
- నమ్మకమైన వ్యక్తిని ఇంటికి వాచ్‌మెన్‌గా పెట్టుకోవాలి.
- బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఉంటే బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి.
- ఇంటికి తాళం వేసి వెళ్లే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.
- సెంట్రల్ లాకింగ్ సిస్టం తాళాలు అమర్చుకోవడం మంచిది.
- ఇంటి ఎదుట చెత్త, న్యూస్ పేపర్స్, పాల ప్యాకెట్లు జమకాకుండా చూసుకోవాలి.
- ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం ఉన్న తాళాలను అమర్చుకోవాలి
- పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించండి చెప్పడం మర్చిపోవద్దు.
- వాహనాలకు తాళం వేయాలి. బైక్‌లకు చైన్‌తో కూడిన లాక్ వేయడం మంచిది.

దుకాణాదారులు అప్రమత్తంగా ఉండాలి

పండుగ సందర్భంగా కొత్త దుస్తులు, ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేస్తుంటారు. దీంతో దుకాణాలు రద్దీగా ఉంటాయి. ఇటీవల దొంగలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి దుకాణాల్లో చోరీలు చేస్తున్నారు. సెల్‌ఫోన్లు, నగదు దోచుకెళ్తున్నారు. దుకాణ దారులు రాత్రి వేళ నగదు, విలువైన ప్రతాలు కౌంటర్లలో పెట్టకుండా వెంట తీసుకెళ్లడం శ్రేయస్కరం. నగదును బ్యాంకుల్లో జమ చేసుకోవడం ఉత్తమం. సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలి.

నగలు, నగదు ఇంట్లో ఉంచొద్దు



ప్రతీ ఇంట్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. విలువైన ఆభరణాలు, నగదు ఇంట్లో ఉంచుకోవద్దు. బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. లేదంటే 100 డయల్ చేయాలి.

– విజయ్‌కుమార్, సీఐ షాద్‌నగర్ టౌన్



కాలిబూడిదైన ఇల్లు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు, విలువైన డాక్యుమెంట్లు అగ్నికి ఆహుతి

మొయినాబాద్: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇల్లు దగ్ధమైంది. ఇంట్లోని వస్తులతో పాటుగా బంగారం, నగదు, విలువైన పత్రాలు కాలిబూడదయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని మేడిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి యాదయ్యకు బండల ఇల్లుంది. కుటుంబ సభ్యులు ఉదయం ఇంట్లో దేవుడికి దీపం పెట్టి తాళం వేసి పనికి వెళ్లారు. ఉదయం 10.20గంటల ప్రాంతంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఇంటి నుంచి దట్టమైన పొగలు, మంటలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైరింజన్‌తో వచ్చిన సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే బీరువాలోని నాలుగున్నర తులాల బంగారు ఆభవరణాలు, రూ.40వేల నగదు, ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు, బియ్యం తదితర వస్తువులు కాలిబూడిదయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకుని వచ్చిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. యాదయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు నాయకులు, గ్రామస్తులు కోరారు.



మంటల్లో కాలిన డాక్యుమెంట్లు

108 వాహనంలో మూడు కాన్పులు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఉన్న 108 అంబులెన్స్‌లో శుక్రవారం రాత్రి అత్యవసరంగా మూడు సాధారణ కాన్పులు జరిగాయి. మూడు కాన్పుల్లో ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడబిడ్డ జన్మించగా తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆమనగల్లుకు చెందిన ప్రేమలత శుక్రవారం రాత్రి పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ప్రేమలతను కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్తుండగా మేడిగడ్డతండా వద్ద నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ ఈఎంటీ రమేశ్, పైలెట్ చంద్రశేఖర్ సహకారంతో ప్రేమలత ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ప్రేమలత, నవజాత శిశువును కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లికి చెందిన దివ్య పురిటినొప్పులతో బాధపడుతుందనే సమాచారం అందించడంతో 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా కందుకూరు సమీపంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను కందుకూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కడ్తాల మండలం గానుగుమర్లతండాకు చెందిన అఖిల పురిటి నొప్పులతో బాధపడుతుందని 108 అంబులెన్స్‌కు సమాచారం అందింది. దీంతో ఆమెను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం అఖిలను, చిన్నారిని నగరంలోని కోఠి మెటర్నిటీ ఆస్పత్రిలో చేర్పించారు. ఒకేరోజు రాత్రి ముగురికి సాధారణ కాన్పులు చేసి తల్లీబిడ్డలను క్షేమంగా ఆస్పత్రికి చేర్చిన అంబులెన్స్ ఈఎంటీ రమేశ్, పైలట్ చంద్రశేఖర్‌లను పలువురు అభినందించారు.



108 అంబులెన్స్‌లో జన్మించిన చిన్నారిని తల్లికి అందిస్తున్న సిబ్బంది

ప్రభుత్వ భూములను రక్షించండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

శంకర్‌పల్లి: కొండకల్, కొండకల్ తండాల్లోని ప్రభుత్వ భూములను కొంతమంది అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తూ కొంత కాలంగా తండా వాసులు ఆందోళన చేపడుతున్నారు. ఇటీవల తండావాసులు ఢిల్లీలో ఎస్టీ కమిషన్ జాతీయ సభ్యుడు జాటోతు హుస్సేన్‌ను కలిసి సమస్యను వివరించారు. శనివారం ఆయన కొండకల్ తండాలో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో కలిసి బహిరంగ చర్చకు రావాల్సి ఉండగా.. ఆయన పర్యటన వాయిదా పడింది. అయినప్పటికీ తాండవాసులు ఇతర నాయకులు, సంఘాలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ, గిరిజనుల భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని.. అదే విధంగా కబ్జాకు గురైన భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ లేని భూమికి నంబర్ సృష్టించి, రిజిస్ట్రేషన్లు చేసుకుంటుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కబ్జాకి గురైన వల్లభస్వామి కుంటని అందరూ కలిసి పరిశీలించారు. సమావేశానికి సీపీఎం నాయకులు, గిరిజన సంఘాల నాయకులు, శంకర్‌పల్లి మండలానికి చెందిన వివిధ పార్టీ నాయకులు హాజరయ్యారు.



ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి, నాయకులు

ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

ఆమనగల్లు: పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో శనివారం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం వేశారు. డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఉజ్వలారెడ్డి, డిప్యూటీ కమిషనర్ దశరథ్ సమక్షంలో ఆమనగల్లు సీఐ బద్యానాద్ చౌహాన్ ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహించారు. ప్రభుత్వ ధర రూ.24 వేలు నిర్ణయించగా వేలంలో రూ.45 వేలు పలికింది. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలలో ఇటీవల మొత్తం 73 కేసులు నమోదవ్వగా ఇందులో 128 లీటర్ల నాటుసారా, 5.86 లీటర్ల మద్యం, 4.55 లీటర్ల బీర్లు పట్టుబడ్డాయి. ఈ మద్యాన్ని డీపీఈఓ ఉజ్వలారెడ్డి సమక్షంలో ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఎక్సైజ్ ఎస్‌ఐలు కృష్ణప్రసాద్, అరుణ్‌కుమార్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో సీఎంపై పోస్టులు

యువకుడికి 14 రోజుల రిమాండ్

కొందుర్గు: సోషల్ మీడియాలో ముఖ్యమంత్రిపై అసభ్యకర రీతిలో పోస్టులు పెట్టిన యువకుడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. స్థానికులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన కాశమోని రమేశ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టినట్లు సైబర్ క్రైం పోలీసులు తెలుసుకున్నారు. కేసును సుమోటోగా స్వీకరించిన సైబర్ క్రైం పోలీసులు శుక్రవారం రమేశ్‌ను అదుపులోకి తీసుకుని శనివారం నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు 14 రిమాండ్ విధించడంతో నిందితుడని చర్లపల్లి జైలుకు పంపినట్లు గ్రామస్తులు తెలిపారు.